భర్తలతో గొడవలు

బయటకు వెళ్లిపోయిన భార్యలు

అనూష (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 21: భర్తతో గొడవ పడి ఓ వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాంనగర్ లోని వైఎస్ఆర్ పార్క్ సమీపంలో ఉండే వినీత్ ఆటోడ్రైవర్. అతడికి ఏడేళ్ల క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన అనూషతో వివాహమైంది. ఈ నెల 19న తనకు ఏదైనా ఉద్యోగం చేయాలని ఉందని భర్తతో గొడవపడి తాను పుట్టింటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయింది. భార్య గురించి వినీత్ తనకు తెలిసిన అందరిని వాకబు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో గురువారం వారాసిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంబర్‌నగర్‌లో..

మమత (ఫైల్)

భర్తతో గొడవ పడి పిల్లలను వదిలేసి వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబర్‌నగర్‌లోని గాంధీ విగ్రహం సమీపంలో నివాసముండే శశికాంత్‌కు పదిహేనేళ్ల క్రితం మమతతో వివాహమైంది. వారికి ఓ కూతురు, ఓ కుమారుడు ఉన్నారు. మమత నల్లకుంట శివం రోడ్‌లోని పిజాహట్‌లో టీం మెంబర్‌గా పనిచేస్తోంది. బుధవారం సాయం త్రం భార్యాభర్తలు గొడవపడ్డారు. గురువారం ఉదయం శశికాంత్ ఇంట్లో వంట చేసి డ్యూటీకి వెళ్లాలని భార్యకు చెప్పి పడుకున్నాడు. ఉదయం 7.45కు లేచిన శశికాంత్‌కు ఇంట్లో భార్య కనిపించలేదు. ఆమె డ్యూటీ డ్రెస్, షూ కూడా ఇంట్లోనే ఉండడంతో ఆమె గురించి వాకబు చేశాడు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూలో సింపోజియాలకు సిద్ధం

నేటి నుంచి రెండు రోజుల పాటు జరుగనున్న ఫెస్ట్‌లు

- ఏర్పాట్లలో విద్యార్థులు నిమగ్నం
- తరలిరానున్న వర్సిటీల విద్యార్థులు

నిర్మాణ్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నదుల అనుసంధానం నమూనా (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 21: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని అన్ని డిపార్ట్‌మెంట్‌లలో ప్రతి ఏటా నిర్వహించే సింపోజియంలకు సర్వం సిద్ధమైంది. వివిధ విభాగాలలో వేర్వేరు పేర్లతో జరిపే ఈ సింపోజియంల నిర్వహణా బాధ్యతలను పూర్తిగా ఆయా డిపార్ట్‌మెంట్లలో ఉండే మూడో సంవత్సరం విద్యార్థులు నిర్వర్తిస్తారు. ఈ సింపోజియంలలో భాగంగా పలు విభాగాలలో పోటీలు నిర్వహిస్తారు. అంతేకాకుండా వివిధ అంశాలపై నిపుణులచే ఉపన్యాస కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలలో విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉండడంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు కళాశాలల నుంచే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు ప్రతీ ఏటా పాల్గొంటారు.

ఇదీ నేపథ్యం...

ఓయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు సాంస్కృతిక పరమైన పోటీలను 'అల్గోరిథమ్' పేరుతో గతంలో నిర్వహించేవారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విజ్ఞానాన్ని అందించాలనే ఆలోచనతో 2002 సంవత్సరం నుంచి టెక్నికల్ సింపోజియంలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఈ సింపోజియంలు ఉపయోగపడేలా వాటిని రూపొందించారు. ప్రతి ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ సింపోజియంలను నిర్వహిస్తారు.

సింపోజియంలతో బహిర్గతంకానున్న విద్యార్థుల ప్రతిభ

సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు 'నిర్మాణ్' పేరుతో సింపోజియం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తారు. విద్యార్థులు భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేలా పలు నమూనాలను ప్రదర్శిస్తారు. ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ విద్యార్థులు 'ఆకృతి' పేరుతో సింపోజియం ఏర్పాటు చేస్తారు. అన్ని శాస్త్ర సాంకేతిక పరికరాల పురాతన మోడళ్లతో ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు 'ఇన్ఫినిటీ' పేరుతో, ఎలక్ట్రికల్ విభాగంలో 'టెక్నోనెన్స్', బయోమెడికల్ విభాగంలో 'మెడిటెక్', మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో 'ఇగ్నైట్' పేరుతో సింపోజియంలు నిర్వహించనున్నారు.

మెకానికల్ విద్యార్థుల మెకరీనా

మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు 'మెకరీనా' పేరుతో సింపోజియం నిర్వహిస్తారు. థండర్‌బోట్, రోబోటిక్ ఈవెంట్, మూన్‌స్టర్ ట్రాక్, ఐడియా ప్రజెంటేషన్, ఆటో నోవా, పేపర్ ప్రజెంటేషన్, క్విజ్, లైవ్ ప్రాజెక్టులు తదితర విభాగాలలో పోటీలు నిర్వహిస్తారు. వర్సిటీ ల్యాబ్‌లో ఉన్న అధునాతన యంత్రాలను విద్యార్థులు చూసేందుకు వీలుగా ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. దాదాపు వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యే అవకాశం ఉంది.

పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన

అమీర్‌పేట్, మార్చి 21: సనత్‌నగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్‌లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ జరిగింది. ఐఐపీ కార్యాలయంలో జరిగిన ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో టీఎస్ పీసీబీ సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐపీ విద్యార్థులకు పూర్తిస్థాయి శాస్త్రీయ పద్ధతుల్లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ రీసైక్లింగ్ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఐపీ హైదరాబాద్ ఏవో నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 21: రాష్ట్రంలో గౌడ కార్పొరేషన్‌తో పాటు వివిధ బీసీ కులాల కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం స్వామి గౌడ్ మాట్లాడుతూ కల్లుగీత కార్పొరేషన్ కేవలం గౌడ కుల వృత్తిదారులకు సంబంధించిన కార్పొరేషన్ మాత్రమేనని, గౌడ కార్పొరేషన్ అనేది గౌడ కులం సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడే కార్పొరేషన్ అని వివరించారు. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన గౌడ కులస్తులు ఉన్నారని, వారి అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. అదేవిధంగా వివిధ బీసీ కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పుట్ట పవన్, రాజశేఖర్, బద్రి, సంతోష్, కిరణ్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో పజ్జన గెలుపు ఖాయం

బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేష్‌గౌడ్

అడ్డగుట్ట, మార్చి 21 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేష్ గౌడ్(పెద్దన్న) గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ భారాస అభ్యర్థిగా జననేత, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండే పద్మారావుగౌడ్‌ను ఖరారు చేయడంతోనే విజయం సగం ఖరారైనట్లు ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం సమాలోచనలు చేసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ధీటైన అభ్యర్థి పద్మారావును ఎంపిక చేయడం సంతోషదాయకమన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి నాలుగు సార్లు బంపరు మెజార్టీతో గెలిచిన వ్యక్తి పద్మారావు అని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలపై పద్మారావు గౌడ్‌కు మంచి పట్టు ఉందని, అవే పార్టీకి భారీ విజయాన్ని కట్టబెడుతాయని ఆయన తెలిపారు.

గతంలో సికింద్రాబాద్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ రెండు సార్లు, బీజేపీ రెండుసార్లు వరుసగా గెలిచి సికింద్రాబాద్‌కు చేసిందేమి లేదని, ప్రస్తుత బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా ఉండి కూడా సికింద్రాబాద్‌కు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి చూసే గ్రేటర్‌లో అన్ని అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండా ఎగిరిందని, ఈ సారి సికింద్రాబాద్ పార్లమెంట్‌పై బీఆర్ఎస్ జెండా ఎగురడం తథ్యమన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు అన్నారు.గురువారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.ఈ మేరకు నిబంధలను అతిక్రమించి భారీ శబ్దాలు కలిగిన సైలెన్సర్‌లు బిగించుకొని నడుపుతున్న బుల్లెట్ వాహనాలను స్వాధీనం చేసుకొని,కేసులు నమోదు చేసినట్లుగా ఇన్‌స్పెక్టర్ మధు బాబు తెలిపారు. –బోల్లారం,మార్చి 21

తాగునీటి సమస్యను పరిష్కరించండి

హిమాయత్‌నగర్, మార్చి 21: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీటి సమస్యను పరిష్కరించాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్ గౌడ్ నారాయణగూడ జలమండలి అధికారులను కోరారు. ఓల్డ్ కమేలా బస్తీలో డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న తాగునీరు పైపులైన్ పగిలిపోయి నీరు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో బస్తీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గురువారం బస్తీవాసులు విషయాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కార్పొరేటర్ సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి తక్షణమే పగిలిపోయిన పైపులైన్‌కు మరమ్మతు చేసి తాగునీరు సరఫరా చేయాలని సూచించారు.

నిబంధలను పాటించాలి

- లాడ్జీల నిర్వాహకులకు ఏసీపీ సుబ్బయ్య ఆదేశాలు
- కార్డెన్ సెర్చ్‌లో ఐదుగురు రౌడీ షీటర్లు, 25 బైక్‌లు స్వాధీనం

రెజిమెంటల్‌బజార్‌లోని ఓ లాడ్జీలో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ సుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

మారేడ్‌పల్లి, మార్చి 21: రెజిమెంటల్‌బజార్‌లో గోపాలపురం పోలీసులు గురువారం సాయంత్రం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఐ కౌశిక్‌రెడ్డిలతో పాటు ఉత్తర మండలంలోని 10 మంది ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు ఏఎస్ఐలు, 50 మంది కానిస్టేబుళ్లతో కలిసి రెజిమెంటల్‌బజార్‌లో ఉన్న 25 లాడ్జీలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా లాడ్జీలలో ఉండే వారి పూర్తి వివరాలు సేకరించడంతో పాటు రికార్డులను పరిశీలించారు. కొన్ని లాడ్జీలలో రికార్డుల నిర్వాహణ సరిగ్గా లేకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ సుబ్బయ్య మాట్లాడుతూ....రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేవిధంగా ముందస్తు జాగ్రత్తగా ఈ కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో ఐదుగురు రౌడీషీటర్లు, ముగ్గురు సస్పెక్ట్‌టీటర్లు, 25 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా 5డొమాస్టిక్ సిలిండర్లు కమర్షియల్‌గా వాడుతుండటంతో వాటిని కూడా స్వాధీ నం చేసుకున్నామన్నారు.

లాడ్జి నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా లాడ్జీలను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు. ఎక్కడైనా డబ్బు పంచుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పూజారులకు గౌరవ వేతనాలు అందజేత

అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో ప్రతి రోజూ ధూపదీప, నైవేద్యం సమర్పిస్తున్న పూజారులకు ప్రతి నెలా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గౌరవ వేతనం అందజేస్తున్న విషయం తెలిసిందే. గురువారం గోల్నాక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెలకు సంబంధించి 11 మంది పూజారులకు రూ. 5 వేల చొప్పున మొత్తం రూ.55 వేలు ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా పూజారులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. – గోల్నాక, మార్చి 21:

చలివేంద్రం ప్రారంభం

అంబర్‌పేట, మార్చి 21: తిలక్‌నగర్ శ్రీ శివ శంకర యూత్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇండియన్ బ్యాంకు ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎండాకాలంలో బాటసారులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు అసోసియేషన్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వీరిని స్ఫూర్తి గా తీసుకొని మిగతా స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో

ఉచిత శిక్షణ

మారేడ్‌పల్లి, మార్చి 21: సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి, యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథ, నిరుపేద యువతీ యువకులకు పలు కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు యశోద ఫౌండేషన్ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, టైపింగ్, జీవన నైపుణ్యం, బ్యూటీషియన్, టైలరింగ్ మోహందీ తదితర కోర్సుల్లో ఉచితంగా 3 నెలల పాటు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. శిక్షణ అనంతరం వారి నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు అభ్యర్థులకు కావల్సిన వసతి, భోజనం, రవాణా ఖర్చులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎస్ఎస్సీ, ఇంటర్ పాస్/ఫెయిల్ ,అనాథలు, నిరుపేద యువతీయువకులు, 18–21 ఏండ్లు కలిగిన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ఇతర వివరాల కోసం 87909 03410, 8790361631 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

గోల్నాక, మార్చి 21 : గోల్నాక డివిజన్ అన్నపూర్ణనగర్, శంకర్‌నగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కా ర్పొరేటర్ దూసరి లావణ్య గౌడ్‌కు వారు ఫిర్యాదు చేయగా ఆమె ఆదేశాలతో గురువారం సమస్యను బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. వెంటనే సం బంధిత అధికారులతో మాట్లాడి మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింప చేయించి సమస్యను పరిష్కరించారు.

వైశ్యహాస్టల్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్

కాచిగూడ,మార్చి 21: విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించుకొని, కొత్త క్రీడలపై అధ్యయనం చేయాలని కాచిగూడ వైశ్యహాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్ అన్నారు. వైశ్యహాస్టల్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌మీట్–2024లో భాగంగా క్రికెట్ పోటీలను గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్ హాజరై మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యకమంలో ప్రధాన కార్యదర్శి రవి ప్రసన్నకుమార్, కోశాధికారి రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మల్లినాథసూరి రచనలపై పరిశోధనలు జరగాలి

ప్రొఫెసర్ నీలకంఠం

సంస్కృత అకాడమీ ముద్రించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 21: ప్రముఖ సంస్కృత పండితుడు కోలాచల మల్లినాథసూరి రచనలపై విస్తృత పరిశోధనలు జరగాలని ఉస్మానియా యూనివర్సిటీలోని సంస్కృత అకాడమీ డైరెక్టర్ ప్రొఫెసర్ నీలకంఠం అన్నారు. నేటి యువ సంస్కృత పండితులు ఆ దిశగా ముందడుగు వేయాలని సూచించారు. అకాడమీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మల్లినాథసూరి వాఙ్మయ సదస్సు గురువారంతో ముగిసింది. సదస్సు ముగింపు కార్యక్రమంలో ప్రొఫెసర్ నీలకంఠం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం సంస్కృత విశ్వవిద్యాలయం స్థాపించేందుకు ప్రయత్నించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకుని విశ్వవిద్యాలయం స్థాపించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఇప్పటికే సంస్కృత విశ్వవిద్యాలయాలున్నాయన్నారు. తెలంగాణలో కూడా సంస్కృత విశ్వవిద్యాలయం స్థాపిస్తే రాష్ట్రంలోని ఉత్సాహవంతులైన విద్యార్థులకు సంస్కృతం చదువుకునే అవకాశం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. మెదక్ జిల్లాలో జన్మించి, సంస్కృత శాస్త్రాలన్నీ అధ్యయనం చేసి, ప్రపంచానికి సంస్కృత కావ్యాలు, శాస్త్రాలను చదివేందుకు సులభతరం చేసిన మల్లినాథుడి సేవకు ప్రభుత్వాలు ఇంకా మహోన్నతమైన స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అకాడమీ ముద్రించిన ఐదు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహామహోపాధ్యాయ దోర్బల ప్రభాకరశర్మ, ప్రొఫెసర్ విద్యానంద ఆర్య, తిరుపతి వేదవిశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ పవన్‌కుమార్ శర్మ, మహామహోపాధ్యాయ నల్లగొండ పురుషోత్తమ శర్మ, ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ జోషి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

జూబ్లీహిల్స్, మార్చి 21: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేయించుకోవాలని యూసీడీ యూసుఫ్‌గూడ సర్కిల్ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ ఆఫీసర్ హిమబిందు పేర్కొన్నారు. దీంతో పాటు ఓటరు జాబితాలో తమ పేర్లను సరిచూసుకోవాలని కోరారు. ఇంటర్నేషనల్ ఓల్డర్ ఫెస్టనర్స్ డే పురస్కరించుకుని గురువారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఓటరు నమోదు అవగాహన ర్యాలీ నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 18 ఏండ్లు పైబడిన వారందరూ ఓటరుగా తమ పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు. వంద శాతం ఓటింగ్ నమోదు చేసేందుకు సీనియర్ సిటిజన్స్‌తో పాటు యువత కృషి చేయాలని అన్నారు. ఓటుహక్కు వచ్చిన ప్రతిఒక్కరూ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో కమ్యునిటీ ఆర్గనైజర్లు ప్రశాంత్, వెంకటయ్య, శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న యూసీడీ పీఓ హిమబిందు

రేపటి నుంచి బీసీ జోడో సామాజిక న్యాయయాత్ర

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ, మార్చి 21: తెలంగాణలోని 33 జిల్లాలలో ఈ నెల 23 నుంచి బీసీ జోడో సామాజిక న్యాయ యాత్రను నిర్వహించనున్నట్లు రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ అధ్యక్షతన, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో రాష్ట్రాల బీసీ సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్. కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 10 సీట్లు కేటాయించి, బీసీ డిమాండ్లపై విధి, విధాన ప్రకటన చేసి మ్యానిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 56 కార్పొరేషన్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, కోట్ల శ్రీనివాస్, రాజేందర్, అంజి, సుధాకర్, రామకృష్ణ, అనంతయ్య, రాజ్‌కుమార్, కృష్ణయాదవ్, వెంకటేశ్‌గౌడ్, జీడయ్యగౌడ్, సతీశ్, విశాల్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్థిరమైన గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించాలి

- ఎన్ఐఆర్‌డీ పీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నరేంద్రకుమార్

వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ఎన్ఐఆర్‌డీ పీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నరేంద్రకుమార్

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 21: వ్యవసాయ, అనుబంధ రంగాలపైనే ఎక్కువగా ప్రజలు ఆధారపడి జీవనం కొనసాగిస్తారని జాతీయ గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్డీ పీఆర్) డైరెక్టర్ జనరల్ జి.నరేంద్రకుమార్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్డీలో ఏర్పాటు చేసిన 'గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ కృత్రిమ మేధస్సు'పై రెండు రోజుల అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పీఆర్ చట్టాలపై అధికారులకు అవగాహన ఉంటేనే పల్లెలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న ఇండియా వంటి దేశాల్లో అవసరమని అన్నారు. వ్యవసాయ రంగానికి అనువైన నేలలు, వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజలకు ఆశించిన స్థాయిలో అవగాహన పెంచాల్సిన అవసరం మనపై ఉందని పేర్కొన్నారు. ఆర్డీ, పీఆర్ కార్యక్రమాల్లో వివిధ నేపథ్య రంగాలపై స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించాలని సూచించారు. ప్యానెల్ చర్చలను కలిగిన వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్యా పథకం అమలు, ఆడిట్ ప్రక్రియ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థిక అంశాల్లో కీలకమైన నేపథ్యం, ఏ–1 ఆవశ్యకత పై సుధీర్ఘంగా చర్చించారు. కార్యాచరణ సామర్థ్యం, జవాబుదారితనం మెరుగు పర్చడానికి, ప్రజల విశ్వాసాన్ని పెంచాలని అన్నారు. ఈ సందర్భంగా ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ రీసెర్చ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అదనపు కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్‌కుమార్, ఎంఓ పీఆర్ పంచాయతీరాజ్ పాల్గొని సిస్టమ్ ప్రాముఖ్యతను ప్రస్థావించారు. యూఎస్ఏ, బెల్జియం, ఇండియాకు చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, విధాన నిపుణులతో సహా ప్రఖ్యాత జాతీయ, అంతర్జాతీయ నిపుణులు తమ నైపుణ్యాన్ని పంచుకున్నారు. ప్రకాశ్‌కుమార్, ఆర్టీడీ డాక్టర్ రాజన్, ఐఐటీ రిజిస్ట్రార్ రవీంద్ర మాట్లాడారు. అనంతరం వివిధ సాధనాలు, నమూనాలను ప్రదర్శించారు.